# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, సోమవారం 15 జనవరి 2024 | HYDERABAD




**భోగి మంటలు** భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం కేబీఆర్ పార్కులో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



**భోగి పండ్లు** ఉప్పల్ శిల్పారామంలో ఆదివారం చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న మహిళలు



## ప్రజల జీవితాల్లో నూతన కాంతులు

ఈ సంక్రాంతి ప్రజల జీవితాల్లో నూతన కాంతులు తీసుకురావాలి. ఆనందోత్సాహాలతో మధ్య భోగభాగ్యాలతో సిరి సంపదలతో ప్రజలందరూ ఆనందంగా, సుఖంగా ఉండాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు పండుగ శుభాకాంక్షలు.

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



## క్లీనెస్ట్ సిటీ మేడ్చల్

- దక్షిణ భారత్‌లో రెండో స్థానం

మేడ్చల్, జనవరి 14 : మేడ్చల్ మున్సిపాలిటీకి క్లీనెస్ట్ సిటీ అవార్డు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 25 వేల నుంచి 50వేల జనాభా ఉన్న పట్టణాల్లో మేడ్చల్ మున్సిపాలిటీకి క్లీనెస్ట్ సిటీ అవార్డు వచ్చింది. దక్షిణ భారతదేశ స్థాయిలో కేంద్ర బృందం జరిపిన పరిశీలనలో పారిశుధ్య నిర్వహణలో ఉత్తమంగా వ్యవహరించిన కారణంగా మేడ్చల్‌కు రెండో స్థానం లభించింది. ఈ అవార్డులను రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి అందజేయనున్నారు. మున్సిపాలిటీ అవార్డు రావడంపై చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి, కమిషనర్ టీపీ స్వీఎన్ త్రిల్లేశ్వర్‌రావు హర్షం వ్యక్తం చేశారు.



**అమ్మగారికి దండం పెట్టు ఆన్‌లైన్‌లో మనీ కొట్టు** కూకట్‌పల్లిలోని మలేసియన్ టౌన్ షిప్‌లో గంగిరెద్దుకు ఆన్‌లైన్ పేమెంట్ కొడుతున్న మహిళలు

# పేరు ఏదైనా.. పండుగే పండుగ

పొంగల్, ఉత్తరాయణ్, లోహ్రీ, మకర చౌలా..

### నగరం ఓ మినీ ఇండియా.. ఘనంగా సంక్రాంతి సందడి

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ ఒక మినీ ఇండియా. సంక్రాంతి పండుగను తమిళనాడులో పొంగల్ పేరుతో చేస్తే.. గుజరాత్‌లో ఉత్తరాయణ్, పంజాబ్‌లో లోహ్రీ, ఒడిశాలో మకర చౌలా, మహారాష్ట్రలో మాఘి సంక్రాంతి, కశ్మీర్‌లో శిశుర్ సంక్రాంత్, యూపీ, బీహార్‌లో ఖిచ్డీ పర్వ్ పేరుతో పండుగ చేసుకుంటారు. పేరు ఏదైనా నగరంలో ఆయా రాష్ట్రాల ప్రజలు వేడుకలను వారి పద్ధతుల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. ఇంటి ముంగిట రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలిపటాల రెపరెపలు, విభిన్న రకాల పిండి వంటలతో తెలుగువారి సంక్రాంతి సందడి నగరంలో జోరుగా సాగుతున్నది. ఇంకోవైపు కాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీలన్నీ ఒకే వేదికపై సంక్రాంతి సంబురాలు జరుపుకుంటున్నారు.



పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మెహబూబ్ కళాశాలలో జరిగిన లోహ్రీ మేళా

# కైట్స్ అండ్ ఫుడ్స్

### నగరంలో ఫెస్టివల్ మజా



పరేడ్ మైదానంలో ఆదివారం కైట్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విదేశీ మహిళ



పరేడ్ మైదానంలో ఆదివారం విభిన్న రకాల రుచులను ఆస్వాదిస్తున్న మహిళలు

సిటీబ్యూరో, జనవరి 13 (నమస్తే తెలంగాణ) :నగరంలో పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైన కైట్స్ ఫెస్టివల్‌కు నగరవాసులు కుటుంబ సభ్యులతో తరలివెళ్లి పతంగుల పండుగ ఎంజాయ్ చేస్తున్నారు. ఇంటర్నేషనల్ కైట్ ప్లేయర్స్ ఆపరేట్ చేస్తున్న ఆ పతంగులను చూస్తూ పిల్లలు, పెద్దలు మురిసిపోతున్నారు. మరో వేదిక ఫుడ్ ఫెస్టివల్. ఇది కూడా అక్కడే అందుబాటులో ఉంది. విభిన్న రకాల సంక్రాంతి పిండి వంటలతో స్టాళ్లు కొలువుదీరాయి. నోరూరించే వంటకాలతో నగరవాసులకు ఆహార విందును అందిస్తున్నాయి.

### పీపుల్స్‌ప్లాజాలో..

ఖైరతాబాద్, జనవరి 14 : 2014లో తొలుత కైట్ ఫెస్టివల్ ప్రారంభించిందే బీఆర్‌ఎస్ సర్కారు అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి స్వయంగా పతంగులను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో పతంగులను తెచ్చుకొని, మాంజా తయారు చేసుకొని ఎగురవేసేవారమని తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, అత్తిని శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, శైలేందర్, నాగులు, బాబురావు, ఆనంద్ పాటిల్, అరుణ్ భట్, మహేందర్, ఆరీఫ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పీపుల్స్‌ప్లాజాలో పతంగిని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ముగ్గులు వేస్తున్న మహిళలు

## రాష్ట్రపతి నిలయంలో రంగుల హరివిల్లు

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం ముత్యాల ముగ్గులు ఆవిష్కృతమయ్యాయి. రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ కె.రజనిప్రియ ఆధ్వర్యంలో 'సంక్రాంతి సంబురాలు' పేరుతో సాంస్కృతిక, సంప్రదాయ వంటల కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగింటి ఆడపడుచులు రంగవళ్లులు ఆవిష్కరించడంతో సందడి నెలకొంది. ఓవైపు ముగ్గులు, మరోవైపు వంటలతో సందర్శకుల కోలాహలం సంతరించుకున్నది. ముగ్గులు, వంటలు, సంప్రదాయ వేషధారణ, సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. వంటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చెఫ్ రామరాజు, డాక్టర్ అర్చన హాజరయ్యారు.



## 100 రోజుల.. సైక్లింగ్ చాలెంజ్

ఏప్రిల్ 16 వరకు సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): సైక్లింగ్ ప్రోత్సహించడమే లక్ష్యంగా హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో వంద రోజుల సైక్లింగ్ చాలెంజ్ కార్యక్రమానికి నగర సైక్లిస్టుల నుంచి అనూహ్య స్పందన వస్తుందని ఆ సంస్థ ఫౌండర్ నందనూరి రవీందర్ ఆదివారం పేర్కొన్నారు. ప్రతీ రోజు ఐదు కిలో మీటర్లకు మించకుండా సైక్లింగ్ చేస్తూ స్ట్రావా యాప్‌లో సమయం నిక్షిప్తం చేసి వివరాలు పంపిస్తున్నారని తెలిపారు. ఈ ఛాలెంజ్ ఏప్రిల్ 16 వరకు కొనసాగుతుందని వివరించారు.



# నోటీసులతో సరి!

- మొండి బకాయిదారులపై చర్యలు శూన్యం
- లక్ష్యాలు ఖరారు చేసినా వేగం పెరగని కలెక్షన్లు
- ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్‌ఎంసీ ఆపసోపాలు

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో ఆస్తి పన్ను వసూలు అధికారులకు సవాల్‌గా మారుతోంది. మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికలు, ప్రజాపాలనకు తొమ్మిది రోజులు అధికారయంత్రాంగం ఫోకస్ పెట్టడంతో ఆస్తిపన్ను వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. మరో వైపు వచ్చే నెలాఖరులోగా పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలున్నాయన్న చర్చ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం కష్టంగానే మారింది. ఆస్తిపన్ను వసూళ్లలో రోజువారీ లక్ష్యాలను ఖరారు చేసినా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. సర్కిళ్ల వారీగా టాప్-100 బకాయిదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, జోనల్ కమిషన్లు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ అధికారులు నోటీసులు మాత్రమే జారీ చేసి చేతులు దులుపుకున్నారు. క్షేత్రస్థాయిలో చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా డిసెంబర్ నెలలో దాదాపు రూ.240కోట్ల లక్ష్యంలో సగం కూడా దాటలేదని తెలుస్తోంది. మొత్తంగా మరో రెండున్నర నెలల్లో దాదాపు రూ.830కోట్ల మేర ఆదాయం రాబట్టడం కష్టసాధ్యమేనన్నది అధికారుల వాదన. ఇదే జరిగితే సంస్థ ఆర్థిక నష్టాల్లో మరింత కూరుకుపోయి ఉద్యోగుల వేతనాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.



# చైనా మాంజా.. విసిరింది పంజా

### గొంతుకు చుట్టుకొని జవాన్ మృతి



చైనా మాంజా తట్టుకొని మృతి చెందిన జవాన్

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): నిషేధిత పతంగుల దారాలు మనిషుల ప్రాణాలు తీస్తున్నాయి. చైనీస్ మాంజాల విక్రయాలపై నిషేధమున్నా విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయి. చైనీస్ మాంజా పర్యావరణానికి, పక్షులు, మనిషులకు ప్రమాదమని దీనిని నిషేధించారు. గ్లాస్‌తో తయారు చేసిన నిషేధిత మంజాలను అక్రమ పద్ధతిలో నగరానికి తెచ్చి పలువురు విక్రయిస్తున్నారు. తాజాగా నగరంలో బైక్‌పై వెళ్తున్న ఆర్మీ జవాన్‌ను గొంతుకు తట్టుకొని అతని ప్రాణాలను తీసేసింది. గతంలో నెల రోజుల ముందు నుంచే పతంగుల దుకాణాలలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించేవారు. కానీ ఈ ఏడాది ఒకటి రెండు సార్లు మినహా తనఖీలు నిర్వహించలేదు. దీంతో విచ్చలవిడిగా నిషేధిత మంజాల విక్రయాలు కొనసాగాయి. ఎక్కడ చూసిన క్షేత్ర స్థాయిలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుండడంతో, అది మనిషుల ప్రాణాలపైకి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పతంగులు ఎగురవేస్తూ..

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ సందర్భంగా గాలు పటాలు ఎగురవేసే సమయంలో పిల్లల పట్ల జాగ్రతగా ఉండాలని ట్రై కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు ప్రజలకు సూచించారు. గడిచిన రెండు రోజుల్లో గాలిపటాలు ఎగురవేస్తూ ఇద్దరు చిన్నారులు సహా ఒక యువకుడు భవనాలపై నుంచి కిందపడి, విద్యుద్ఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. పిల్లలు భవనాలపైకి ఎక్కి గాలిపటాలను ఎగురవేసే సమయంలో వారి వెంట తప్పనిసరిగా పెద్దవారు ఉండేలా చర్యలు తీసుకోవాలి. భవనాలపై రేలింగ్ అంచుల వరకు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలని, అంతే కాకుండా రేలింగ్ లేని టెర్రస్‌లపై పిల్లలను అనుమతించవద్దని పోలీసులు సూచించారు. అంతే కాకుండా భవనాల పక్కన విద్యుత్ తీగలుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి భవనాలపైన పిల్లలు లేదా పెద్దలు గాలిపటాలను ఎగురవేయరాదని అన్నారు.



కొంపల్లిలో ఆదివారం పతంగి ఎగురవేస్తూ భవనం పై నుంచి కిందపడి మృతిచెందిన ఆకాశ్ (ఫైల్)

# కరెంట్ పోతే ఫోన్ చేయండి

- సర్కిళ్ల వారిగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



విద్యుత్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎగరవేస్తున్న పతంగులతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే స్థానిక విద్యుత్ అధికారులను ఫోన్‌లో సంప్రదించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 9 సర్కిళ్ల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడితే విద్యుత్ షాక్‌తో పాటు, విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో సర్కిళ్ల వారిగా కంట్రోల్ రూమ్స్‌ను ఏర్పాటు చేశామని సీఎండీ తెలిపారు. సమావేశంలో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస్ రెడ్డి, సీజీఎం మేడ్చల్ జోన్ కె.సాయిబాబా, సీజీఎం రంగారెడ్డి జోన్ పి.ఆనంద్, సీజీఎం మెట్రో జోన్ నరసింహాస్వామి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

| సర్కిల్ | ఫోన్ నంబరు |
|---|---|
| హైదరాబాద్ సెంట్రల్ | 9491629047 |
| హైదరాబాద్ సౌత్ | 9491628269 |
| సికింద్రాబాద్ | 9491629380 |
| బంజారాహిల్స్ | 9491633294 |
| సైబర్ సిటీ | 9493193149 |
| రాజేంద్రనగర్ | 7382100322 |
| సరూర్‌నగర్ | 7901679095 |
| హబ్సీగూడ | 9491039018 |
| మేడ్చల్ | 7382618971 |

### ఫిర్యాదులు ఇలా..

ఎలక్ట్రిసిటీ కాల్ సెంటర్ 1912
Twitter:@tsspdclcorporat
Facebook:@gmcsc.tsspdcl
www.tssouthernpower.com
మొబైల్ యాప్ : TSSPDCL
డయల్ – 100

### అంతరాయానికి చింతిస్తున్నాం..

జీహెచ్‌ఎంసీ పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయంపై టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ ఆదివారం ట్వీట్ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్షిక నిర్వహణ, మరమత్తుల కార్యకలాపాల్లో భాగంగా 2 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాం. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని డిమాండుకు అనుగుణంగా నవంబర్ నుంచి జనవరి వరకు నిర్వహణ పనులు చేయాల్సి ఉండగా, అసెంబ్లీ ఎన్నికల కారణంగా వాటిని చేయలేకపోయాం అని ట్వీట్ చేశారు. తర్వాత కొన్ని గంటలకు విద్యుత్ సరఫరా అంతరాయంపై సీఎండీ చేసిన ట్వీట్‌ను ఆయన తొలగించారు.

## కాలనీల్లో నిఘా

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలు తమ సొంత ఊళ్లకు వెళ్లడంతో ఆయా కాలనీలు సగం ఖాళీ అయ్యాయి. అయితే ఇదే అదనుగా తీసుకుని దోపిడీ దొంగలు విరుచుపడకుండా ట్రై కమిషనరేట్లకు చెందిన పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రధానంగా రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా జనసంచారం తక్కువగా ఉన్న కాలనీలు, బస్తీల్లో ప్రత్యేక నిఘా పెట్టామని, సీసీకెమెరాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టినట్లు అధికారులు తెలిపారు.

